WWWJAN0DYA.com

janodaya

# జనోదయ

కరీంనగర్ శనివారం 06.12. 2025 సంపుటి : 03సంచిక : 05 పేజీలు : 08 వెల: రూ.5

Karimnagar Saturday 06.12.2025 Volume:03 Issue 05 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

## ఏఐ ఎక్స్ లెన్స్ సెంటర్ ఏర్పాటుకు ఆస్ట్రేలియాతో కీలక ఒప్పందం

ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

2





మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ ఒట్టి బూటకమని మావోయిస్టులు ఆరోపించారు. హిడ్మా ఆచూకీ కోసం పోలీసులు ఎలాంటి ఆపరేషన్ నిర్వహించలేదని.. దారుణంగా హత్య చేశారని వికల్ప్ పేరుతో మావోయిస్టు పార్టీ ఓ లేఖ విడుదల చేసింది.

# హిడ్మాది హత్య

## మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ ఒట్టి బూటకం

### ➤ లేఖ విడుదల చేసిన మావోయిస్టుల

- హిడ్మా హత్యకు నలుగురు వ్యక్తులే కారణం
- కోసాల్ అనే వ్యక్తి ముఖ్యుడు
- విజవాడకు చెందిన కలప వ్యాపారి,పర్నిచర్ వ్యాపారి కాంట్రాక్టర్ ఇందుకు కారకులు
- అక్టోబర్ 27న కలప వ్యాపారి ద్వారా చికిత్స కోసం విజవాడకు హిడ్మా
- ఆ సమాచారం పోలీసులకు అందజేత
- హిడ్మాను పోలీసులు సజీవంగా పట్టివేత
- ఆయనతోపాటు 12మందిని పట్టుకుని హత్య
- మారేడుమిల్లి ఘటనకు ప్రతీకారం తీర్చుకుంటాం

2

# ఢిల్లీని ఢీకొడతా



## కేంద్రాన్ని నిలదీస్తా



- తెలంగాణకు మోదీ ప్రభుత్వం అన్యాయం
- రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఎందుకు సహకరించడంలేదు?
- మోదీ ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్
- ఆడబిడ్డలకు చీర, సారె అందజేస్తాం

2

ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు మోదీ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎందుకు సహకరించడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణ ప్రజలు ఆశీర్వదిస్తే ఢిల్లీని ఢీకొడతానని హెచ్చరించారు. తనకు వయస్సు ఉందని, ఓపిక ఉందని కేంద్రాన్ని నిలదీస్తానని వార్నింగ్ ఇచ్చారు. శుక్రవారం నర్సంపేటలో సీఎం పర్యటించారు.

# హిల్ట్ పాలసీపై విచారణ

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు
- కేఏ పాల్ పిటిషన్లు దాఖలు
- తదుపరి విచారణ డిసెంబర్ 29వ తేదీకి వాయిదా




**హైదరాబాద్, డిసెంబరు 5 :** హిల్ట్ పాలసీపై తెలంగాణ హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. హిల్ట్ పాలసీపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పిటిషన్లు దాఖలు చేశారు. 9,292 ఎకరాల భూ కేటాయింపుల విషయంలో రూపొందించిన జీఓ నిబంధనలకు విరుద్ధంగా ఉందని హైకోర్టుకు ఆయన తెలిపారు. దీనిపై సీబీఐ లేదా ఈడీ దర్యాప్తు చేయించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు ఉన్న రికార్డులను సీజ్ చేసి ఫోరెన్సిక్ ఆడిట్ చేయించాలని కోర్టుకు విన్నవించారు. పిటిషనర్ వాదనలు విన్న ధర్మాసనం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. వెంటనే రిప్లై ఫైల్ దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 29వ తేదీకి వాయిదా వేసింది హైకోర్టు.

# ఆలయ నిధులను వాటి అభివృద్ధికే వాడాలి

### సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** ఓ గుడిలోని దేవుడికి సంబంధించిన డిపాజిట్ డబ్బును ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సహకార బ్యాంకులను ఆదుకోవడానికి ఉపయోగించకూడదని శుక్రవారం సుప్రీంకోర్ట్ ఆదేశించింది. తిరునెల్లి దేవస్థానం డిపాజిట్ సొమ్మును దేవస్థానం బోర్డ్‌కు రెండు నెలల్లో వెనక్కి ఇవ్వాలన్న కేరళ హైకోర్ట్ ఆదేశాన్ని కొన్ని సహకార బ్యాంకులు సుప్రీం కోర్ట్‌లో సవాల్ చేశాయి. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్ట్ ఈ వ్యాఖ్యలు చేసింది. దేవుడి డబ్బు కేవలం దేవాలయ ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేసింది.

# సిరీస్ ఎవరిదో?

### నేడు భారత్, దక్షిణాఫ్రికా మూడో వన్డే




**విశాఖపట్నం:** స్వదేశంలో భారత క్రికెట్ జట్టు మరో ఆసక్తికర సమరానికి సిద్ధమైంది. దక్షిణాఫ్రికాతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ 1-1తో సమంగా ఉండగా శనివారం సాగరతీర నగరం విశాఖపట్నం వేదికగా టీమ్‌ఇండియా.. సిరీస్ విజేతను నిర్ణయించే మూడో మ్యాచ్‌లో తలపడబోతున్నది. రాంచీలో అదరగొట్టి రాయ్‌పూర్‌లో అదృష్టం వెక్కిరించడంతో అపజయం వైపు నిలిచిన మెన్ ఇన్ బ్లూ.. టెస్టు సిరీస్ పరాభవానికి ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమైంది. మరో వైపు సౌతాఫ్రికా మాత్రం.. టెస్టు సిరీస్‌తో పాటు వన్డే సిరీస్‌నూ గెలుచుకుని 40 ఏండ్లుగా భారత గడ్డపై విదేశీ జట్లు సాధించలేని ఘనతను అందు కోవడానికి ఒకే ఒక విజయం దూరంలో నిలిచింది. భారత్‌లో టాస్ అత్యంత కీలకం. మరీ ముఖ్యంగా శీతాకాలంలో మంచు ప్రభావం తీవ్రంగా ఉండనున్న నేపథ్యంలో.. జట్ల గెలుపోటములు నిర్దేశించే టాస్ గెలవడంలో టీమ్‌ఇండియాను అదృష్టం దారుణంగా వెక్కిరిస్తున్నది. భారత జట్టు వన్డేల్లో చివరిసారిగా టాస్ గెలిచి దాదాపు రెండేండ్లు గడిచిపోయింది.

# తటస్థంగా కాదు.. శాంతి వైపు ఉన్నాం

### చర్చల, దౌత్యం ద్వారా ఉక్రెయిన్ సంక్షోభానికి ఫుల్‌స్టాప్ పెట్టాలి ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఉక్రెయిన్-రష్యా సంక్షోభంపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. భారత్ తటస్థంగా లేదు అని, తాము శాంతి వైపు ఉన్నామని అన్నారు. ఢిల్లీలో శుక్రవారం హైదరాబాద్ హౌజ్‌లో పుతిన్‌తో జరిగిన సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చర్చల, దౌత్యం ద్వారా ఉక్రెయిన్ సంక్షోభానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని మోదీ పేర్కొన్నారు. ఆ సంక్షోభానికి శాంతియుత పరిష్కారాన్ని ఆశిస్తున్నామని, దానికే తమ మద్దతు ఉంటుందని ప్రధాని తెలిపారు. అయితే మోదీ వ్యాఖ్యలకు పుతిన్ స్పందించారు. ఉక్రెయిన్‌తో కొనసాగుతున్న యుద్ధాన్ని ఆపేందుకు శాంతియుత పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామని పుతిన్ తెలిపారు. శాంతి మార్గంలోనే ప్రపంచ సంక్షేమం ఉందన్నారు. కలిసికట్టుగా శాంతి కోసం మార్గాలు అన్వేషించాలన్నారు. గత కొన్ని రోజులుగా ఆ దిశగా చర్యలు జరుగుతున్నాయని, తనకు విశ్వాసం ఉందని, ప్రపంచంలో మళ్లీ శాంతి వికసిస్తుందని ఆశిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు.

# మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే

- అన్ని కాలాలు ఒకేలా ఉండవ్: కేసీఆర్
- కేసీఆర్ దత్తత గ్రామాల్లో ఏకగ్రీవం
- బీఆర్ఎస్ అధినేతను కలిసిన ఎర్రవల్లి, నర్సన్నపేట నూతన సర్పంచ్‌లు



**హైదరాబాద్ :** బీఆర్ఎస్ పాలనలో ప్రగతిబాట పట్టిన గ్రామాలన్నీ కాంగ్రెస్ పాలనలో కునారిల్లిపోతున్నాయని, రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ అన్నారు. గ్రామాలకు తిరిగి మంచి రోజులు వస్తాయని పేర్కొన్నారు. కేసీఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దత్తత తీసుకున్న ఎర్రవెల్లి, నర్సన్నపేట గ్రామ సర్పంచ్ స్థానాలతో పాటు ఆ గ్రామాల్లోని పలు వార్డు మెంబర్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఎర్రవల్లి సర్పంచ్‌గా ఎన్నికైన కవిత, నర్సన్నపేట సర్పంచ్‌గా ఎన్నికైన బాల్‌నర్సయ్య, పలువురు వార్డు సభ్యులు సిద్దిపేట జిల్లా మర్కుక్ మండ లం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మాజీ సీఎం కేసీఆర్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏకగ్రీవంగా ఎన్నికైనవారిని మాజీ సీఎం సత్కరించి అభినందించారు. అనంతరం ఆ సర్పంచ్‌లు, వార్డు సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. అన్ని కాలాలు ఒకేలా అనుకూలంగా ఉండవని, కొన్ని సమయాల్లో కష్టాలు వస్తాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని కేసీఆర్ ఉద్బోధించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన స్ఫూర్తితో స్వయంశక్తితో పల్లెలను అభివృద్ధి చేసుకుంటూ ముందడుగు వేయాలని, గ్రామాభివృద్ధికి పాటుపడాలని సూచించారు.

# ఏఐ ఎక్స్ లెన్స్ సెంటర్ ఏర్పాటుకు ఆస్ట్రేలియాతో కీలక ఒప్పందం

- ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు







**జనోదయ:హైదరాబాద్:**

ఆస్ట్రేలియాకు చెందిన డీకిన్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో రాష్ట్రంలో కృత్రిమ మేథకు సంబంధించిన సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను ఏర్పాటు చేయడానికి తెలంగాణా ప్రభుత్వం శుక్రవారం నాడు కీలక ఒప్పందం చేసుకుంది. దేశంలోనే ఈ తరహా నైపుణ్య శిక్షణ కేంద్రం (సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్) మొట్టమొదటిది. ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్యా మంత్రి జూలియన్ హిల్ తో కలిసి సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల బాబు ఎంఓయు వివరాలను వెల్లడించారు. ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేయనున్న ఏఐ యూనివర్సిటీలో ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను నెలకొల్పనున్నట్టు శ్రీధర్ బాబు తెలిపారు. డీకిన్ అప్లయిడ్ ఆర్టిఫిషియల్ ఇన్ స్టిట్యూట్ ఈ ఎక్సెలెన్స్ సెంటర్ ను రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నిర్వహిస్తుందని ఆయన వివరించారు. కాలేజిల నుంచి అకడమిక్ గ్రాడ్యుయేట్లను కాకుండా ప్రపంచ స్థాయి నైపుణ్యాలతో కూడిన ప్రతిభావంతులను తయారు చేయాలన్న లక్ష్యంతోనే ఆస్ట్రేలియా ప్రభుత్వంతో ఈ భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్టు ఆయన చెప్పారు. విదేశీ విశ్వవిద్యాలయాలను రాష్ట్రానికి తీసుకురావడానికి సిఎం రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే ఈ ఒప్పందం జరిగిందని ఆయన వెల్లడించారు. ప్రభుత్వ పాలన, ఆరోగ్యం, విద్య, ఐటీ, లైఫ్ సైన్సెస్, వ్యవసాయం, క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ మెటల్స్ రంగాల్లో పరిశోధన, నైపుణ్య శిక్షణ అందజేయడానికి ఈ సెంటర్ ఎక్స్ లెన్స్ ఉపయోగపడుతుంది. డిజిటల్ ఇండియా భవిష్యత్తుకు తెలంగాణా ముఖ ద్వారం కానుందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. "రాష్ట్రంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో కూడా నైపుణ్య శిక్షణ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇటీవల ఆస్ట్రేలియాను సందర్శించిన సందర్భంగా డీకిన్ యూనివర్సిటీని రాష్ట్రంలో క్యాంపస్ ఏర్పాటు చేయాల్సిందిగా ఆహ్వానించాం. తెలంగాణాలో నూతన ఆవిష్కరణలకు అనుకూలమైన ఎకోసిస్టం ఉంది. దీనికి ఈ ఎక్స్ లెన్స్ సెంటర్ సేవలు మరింత ఉపయోగపడతాయి. ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వృత్తి నిపుణులకు తమ దేశంలో ఉన్నత స్థాయి నైపుణ్యాల్లో శిక్షణ అందించడానికి కూడా ఆస్ట్రేలియా అంగీకరించింది".ఎంఓయు కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీ సలహాదారు ఐ. సాయిక్రిష్ణ, ఆస్ట్రేలియా ప్రతినిధులు క్యామ్ గ్రీన్, కరేన్ సాండర్ కాక్, నథానియెల్ వెబ్, స్టీవెన్ బిడిల్, హిల్లరీ మెక్ గీచి, స్టీవెన్ కానోలీ, విక్రం సింగ్, ఐటీ శాఖ చీఫ్ స్ట్రాటెజిస్ట్ శ్రీకాంత్ లంకా తదితరులు పాల్గొన్నారు.



**మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ ఒట్టి బూటకమని మావోయిస్టులు ఆరోపించారు. హిడ్మా ఆచూకీ కోసం పోలీసులు ఎలాంటి ఆపరేషన్ నిర్వహించలేదని.. దారుణంగా హత్య చేశారని వికల్ప్ పేరుతో మావోయిస్టు పార్టీ ఓ లేఖ విడుదల చేసింది.**

# హిడ్మాది హత్యే

## మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ ఒట్టి బూటకం

## ➤ లేఖ విడుదల చేసిన మావోయిస్టుల

- హిడ్మా హత్యకు నలుగురు వ్యక్తులే కారణం
- కోసాల్ అనే వ్యక్తి ముఖ్యుడు
- విజవాడకు చెందిన కలప వ్యాపారి,పర్నిచర్ వ్యాపారి కాంట్రాక్టర్ ఇందుకు కారకులు
- అక్టోబర్ 27న కలప వ్యాపారి ద్వారా చికిత్స కోసం విజవాడకు హిడ్మా
- ఆ సమాచారం పోలీసులకు అందజేత
- హిడ్మాను పోలీసులు సజీవంగా పట్టివేత
- ఆయనతోపాటు 12మందిని పట్టుకుని హత్య
- మారేడుమిల్లి ఘటనకు ప్రతీకారం తీర్చుకుంటాం

**హిడ్మాది హత్య.. ఏపీ పోలీసులు చేపట్టిన ఆపరేషన్ కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ ఆపరేషన్**

**హైదరాబాద్: జనోదయ**

మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ ఒట్టి బూటకమని మావోయిస్టులు ఆరోపించారు. హిడ్మా ఆచూకీ కోసం పోలీసులు ఎలాంటి ఆపరేషన్ నిర్వహించలేదని.. దారుణంగా హత్య చేశారని వికల్ప్ పేరుతో మావోయిస్టు పార్టీ ఓ లేఖ విడుదల చేసింది. మావోయిస్టు అగ్రనేతలే దీని వెనుక ఉన్నారన్న ప్రచారాన్ని తోసిపుచ్చింది. 'అగ్రనేతలు దేవ్‌జీ, రాజిరెడ్డిలు తమతోనే ఉన్నారు. వాళ్లు లొంగిపోవడానికి ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోలేదు. హిడ్మా సమాచారాన్ని దేవ్‌జీ చెప్పారనడం అవాస్తం. చికిత్స కోసం హిడ్మా విజయవాడకు వెళ్లారు. హిడ్మా హత్యకు నలుగురు వ్యక్తులే కారణం. వారిలో కోసాల్ అనే వ్యక్తి ముఖ్యుడు. విజయవాడకు చెందిన కలప వ్యాపారి, ఫర్నీచర్ వ్యాపారి, మరో కాంట్రాక్టర్ ఇందుకు కారకులు. అక్టోబర్ 27న చికిత్స కోసం కలప వ్యాపారి ద్వారా విజయవాడకు హిడ్మా వెళ్లారు. ఆ సమాచారాన్ని పోలీసులకు అందించారు. దీంతో హిడ్మాను పోలీసులు సజీవంగా పట్టుకున్నారు. ఆయనతోపాటు 12 మందిని పట్టుకుని హత్య చేశారు. హత్యలను కప్పుపుచ్చుకునేందుకు మారేడుమిల్లి, రంపచోడవరం ఎన్‌కౌంటర్లని కట్టు కథలు అల్లారు. హిడ్మాది హత్య.. ఏపీ పోలీసులు చేపట్టిన ఆపరేషన్ కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ ఆపరేషన్. మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారం తీర్చుకుంటాం. చనిపోయిన మావోయిస్టుల ఆశయాలను ముందుకు తీసుకు వెళ్తాం.' అని ఆ లేఖలో పేర్కొంది.



# ఢిల్లీని ఢీకొడతా..

- కేంద్రాన్ని నిలదీస్తా
- తెలంగాణకు మోదీ ప్రభుత్వం అన్యాయం
- రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎందుకు సహకరించడం లేదు
- మోదీ ప్రభుత్వానికి సీఎం రేవంత్‌రెడ్డి వార్నింగ్
- జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌ను బండకేసి కొట్టారు



**వరంగల్, డిసెంబరు5 :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు మోదీ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎందుకు సహకరించడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణ ప్రజలు ఆశీర్వదిస్తే ఢిల్లీని ఢీకొడతానని హెచ్చరించారు. తనకు వయస్సు ఉందని, ఓపిక ఉందని కేంద్రాన్ని నిలదీస్తానని వార్నింగ్ ఇచ్చారు. శుక్రవారం నర్సంపేటలో సీఎం పర్యటించారు. రూ.508 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించారు సీఎం రేవంత్‌రెడ్డి.'జూబ్లీహిల్స్ ఎన్నిక రెఫరెండం అన్నోళ్లు ఇంట్లో పండుకోక మళ్లీ అబద్ధాలు చెబుతూ తిరుగుతున్నారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌ను బండకేసి కొట్టారు. అభివృద్ధి జరగాలంటే మంచి సర్పంచ్‌ను ఎన్నుకోండి. స్థానిక సంస్థల ఎన్నికల్లో క్వార్టర్‌కో, హాఫ్‌కో, ఫుల్లుకో ఓటు వేయొద్దు. ఎన్నికల్లో పైసలు ఖర్చు చేయొద్దు, ప్రజల మనసుతో గెలవాలి. గ్రామాల్లో ఉండే యువకులు సర్పంచ్ ఎన్నికల్లో పోటీచేయండి. గ్రామాల్లో సర్పంచులు మంచోళ్లను గెలిపిస్తే అభివృద్ధి సాధ్యమవుతుంది. వరంగల్ ఎయిర్‌పోర్ట్ కోసం మాజీ సీఎం కేసీఆర్ ఎనాడైనా ఆలోచించారా..? తెలంగాణలో హైదరాబాద్ మినహా ఎక్కడా ఎయిర్‌పోర్ట్ నిర్మించాలన్నా ఆలోచన కేసీఆర్‌కు రాలేదు. మార్చి 31వ తేదీలోపు వరంగల్‌లో ఎయిర్ పోర్ట్ పనులు ప్రారంభిస్తాం. గడీల పాలనను ప్రజలు కూలగొట్టారు. పదేళ్లలో గత పాలకులు మాత్రమే భారీగా ఆస్తులు సంపాదించారు. వాళ్లు ఆకాశానికి ఎదిగారు తప్ప.. ప్రజలను పట్టించుకోలేదు. వరి పండించండి.. ప్రతిగింజ మేం కొంటాం. రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో అందజేసిన తెలంగాణను.. కేసీఆర్ అప్పులపాలు చేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేశారు. రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు అందజేశాం. వచ్చే ఏప్రిల్‌లోపు నర్సంపేటకు 3,500 ఇళ్లు మంజూరు చేస్తాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'హైదరాబాద్ స్థాయిలో వరంగల్‌ను అభివృద్ధి చేస్తాం. రేషన్ ఇవ్వాలంటే గజ్వేల్‌లో ఫాంహౌస్ రాసిచ్చినట్లుగా కేసీఆర్ ఫీలయ్యారు. కోటి పది లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం. మూడు కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నాం. ఏపీ కంటే అధికంగా వడ్లు పండించిన రాష్ట్రం తెలంగాణ. కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదన్నారు కానీ రైతులకు 24గంటల విద్యుత్ ఇస్తున్నాం. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో వరి పండించాలని చెప్పాం. ప్రపంచానికే పౌరుషాన్ని చాటిన వీరవనితలు సమ్మక్క – సారలమ్మ. ప్రజాపాలనకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ విజయోత్సవాలు జరుపుకుంటున్నాం. ఏ ఊళ్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారో అక్కడే బీఆర్ఎస్ నేతలు ఓట్లు అడగాలి... మేము ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన దగ్గర ఓట్లు అడుగుతాం. తరతరాలుగా కుల వృత్తుల బతుకులు మార్చలేదు... చదువు ఒక్కటే పిల్లల భవిష్యత్తు మార్చుతుంది' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

### ఆడబిడ్డలకు చీర, సారె అందజేస్తాం..

ఇరిగేషన్, ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యం ఇస్తాం. కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తాం. 18 ఏళ్లు పైబడిన ప్రతి ఆడబిడ్డకు చీరలు అందిస్తున్నాం. కోటిమంది ఆడబిడ్డలకు చీర, సారె అందజేస్తాం. ఇందిరమ్మ చీరలకు ఎంత ఖర్చయినా భరిస్తాం. త్వరలో మహిళల ఉత్పత్తులు ఆన్‌లైన్‌లోనూ అమ్మకాలు చేసేలా చర్యలు చేపడతాం. పేదబిడ్డలకు నాణ్యమైన చదువు అందించే బాధ్యత మాది. త్వరలోనే 40 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేస్తాం. నిరుద్యోగులు బాగా చదవండి.. ఉద్యోగాలు సాధించండి. గ్రామాల్లో రాజకీయ కక్షలకు యువత బలికావొద్దు. గ్రామాల్లో రూ.20 వేల కోట్లతో రోడ్లు వేస్తున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

# చివరి రోజు నామినేషన్ల వెల్లువ

## పోటాపోటీగా నామినేషన్ల దాఖలు

**జనోదయ, మందమర్రి డిసెంబర్ 5**

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా మూడవ విడత జరగనున్న ఎన్నికలలో పోటీ చేసేందుకు వివిధ రాజకీయ పార్టీలు బలపరిచిన అభ్యర్థులు, గ్రామ ప్రముఖులు పోటాపోటీగా నామినేషన్ దాఖలు చేయడంతో నామి నేషన్ కేంద్రాలు జన సందోహంతో సందడిగా మారాయి. మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ల దాఖలుకు శుక్రవారం చివరి రోజు కావడంతో మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అందుగుల పేట, సారంగపల్లి, పోన్నారం క్లస్టర్ కేంద్రాలలో 10 గ్రామ పంచాయతీలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, ఔత్సాహికులు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేయడంతో ఆయా క్లస్టర్ కేంద్రాలు జన సందడిగా మారాయి. పోటీ చేసే అభ్యర్థులు తమ అనుచరులు మద్దతు దారులతో కలసి భాజా భజంత్రీలు, మేళ తాళాలతో టపాసులు పేలుస్తూ బారి ర్యాలీగా తరలివచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. మండలం లోని పది పంచాయతీలకు సర్పంచ్ వార్డ్ సభ్యులకు పోటీ చేసే అభ్యర్థులు చివరి రోజు బారీగా తరలి వచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. అధికార కాంగ్రెస్ బీఆర్ఎస్ బిజెపి సిపిఐ పార్టీలు బలపరిచిన అభ్యర్థులతో పాటు పలువురు అధికార విపక్ష పార్టీలకి చెందిన గ్రామస్థాయి నాయకులు పోటీ చేసేందుకు ఆసక్తి కనబరిచి నప్పటికీ పార్టీ మద్దతు దక్కక





పోవడంతో రెబల్‌గా పోటీకి సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకు ప్రశాంతంగా ఉన్న గ్రామాలు ఎన్నికల పుణ్యమా అని ఒక్కసారిగా రాజకీయం వేడెక్కడంతో గ్రామాల్లో ఏ నలుగురు కలిసినా ఎన్నికల ముచ్చట్లు చర్చకు వస్తుండ డంతో గ్రామాల్లో ఎన్నికల సందడి స్పష్టంగా కనిపిస్తుంది. నామినేషన్ల ప్రక్రియ ముగియగా అధికారుల నామినేషన్ల పరిశీలన, అనంతరం అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ తర్వాత బరిలో నిలిచిన అభ్యర్థులపై స్పష్టత రానుంది. ఏది ఏమైనప్పటికీ గత కొన్నాళ్లుగా ప్రశాంతంగా ఉన్న పల్లెలు గ్రామపంచాయతీ ఎన్నికలతో రాజకీయ పార్టీల పోటాపోటీ ప్రచారాలతో హోరెత్తనున్నాయి.

# పాముకాటుతో వ్యక్తి మృతి

**జనోదయ, మందమర్రి, డిసెంబర్ 5**



పాముకాటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చిర్రకుంట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు కంది ముకుంద రెడ్డి (60) గ్రామ శివారులోని తన పొలానికి వెళ్ళి వ్యవసాయం పనులు చేస్తుండగా ఈ నెల 3న విషపూరిత పాము అతడి ఎడమ కాలి పాదం పైభాగంలో కాటు వేసింది. వెంటనే అప్రమత్తమైన తోటి రైతులు బాధితుడిని చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసు పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. ఈ మేరకు మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఏఎస్ఐ మాజీద్ ఖాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**జనోదయ, మందమర్రి డిసెంబర్ 5 :**

ఏరియాలోని కేకే 5 గనిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి కార్మికుల ఇబ్బందులు వెంటనే తొలగించాలని ఏఐటియుసి ఏరియా జాయింట్ సెక్రెటరీ కంది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గని అధికారులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు నాణ్యమైన హ్యాండ్ గ్లౌజెస్ ఇవ్వాలన్నారు. ఎంవీటీసీ నుండి గని వరకు రోడ్డు వెంట విపరీతంగా దుమ్ము పేరుకు పోయిందని, దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేసి దుమ్ము రాకుండా నీళ్లు చల్లించాలని కోరారు. చలి తీవ్రత దృష్టిలో ఉంచుకొని ఉద్యోగులకు గరం కోట్లు అందించాలని, అనేక సంవత్సరాలుగా ఎస్డిఎల్ యంత్రాలపై యాక్టింగ్ చేస్తున్న ఉద్యోగులకు ప్రమోషన్లను కల్పించాలని, కార్మికులపై పని భారాన్ని తగ్గించాలన్నారు. పాల చెట్టు ప్రాంతం నుండి గని వరకు గుంతల మయంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గని మేనేజర్ శంబునాద్ పాండేకు అందచేశారు. గని పెట్టు కోవాలి గాండ్ల సంపత్ అధ్యక్షతన జరిగిన కార్య క్రమంలో బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ సోమిశెట్టి రాజేశం, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ ప్రేమ్ లాల్, సొట్ట కొండయ్య,జవాజి శ్రీనివాస్, ఇప్ప నరేందర్,గుగులోతు రాంబాబు, గాజే హేమ చందర్, భూక్య తిరుపతి, రేకుంట్ల రవిలు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు
- సిఐ శశిధర్ రెడ్డి వార్నింగ్

**జనోదయ, మందమర్రి, డిసెంబర్ 5,**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మండల పరిధిలోని పాత నేరస్థులు, రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ కే శశిధర్ రెడ్డి హెచ్చరించారు. త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అసాంఘిక కార్యకలాపాలు, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, రాజకీయ హింసలు నివారించడానికి, ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు సర్కిల్ పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా శుక్రవారం పోలీస్ స్టేషన్ లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా, ప్రజలను బెదిరించినా, శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రయత్నం చేసినా ఉపేక్షించేది లేదని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ముగిసే వరకు ప్రతి రౌడీషీటర్ పోలీస్ నిఘాలో ఉంటారని, ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని అన్నారు. రౌడీ షీటర్లుగా నమోదైన వారందరూ సమాజంలో సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై ఎస్ రాజశేఖర్, రామకృష్ణా పూర్ ఎస్సై రాజశేఖర్, కాసి పేట ఎస్ఐ ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఏసీబీకి పట్టుబడ్డ కన్నెపల్లి కార్యదర్శి



**జనోదయ, బెల్లంపల్లి, డిసెంబర్ 5:**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని (అంబేద్కర్ చౌరస్తా) వద్ద శుక్రవారం రాత్రి ఏసీబీ అధికారులకు రూ 5 వేలు లంచం తీసుకుంటూ కన్నెపల్లి పంచాయతీ కార్యదర్శి గొల్లపల్లి రాజ్ కుమార్ పట్టుబడ్డారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి బెల్లంపల్లిలో కలకలం రేపింది. ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ మధు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కన్నెపల్లి పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్ స్థానిక గ్రామస్తుల నుండి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ మూడవ దశ బిల్లులు ఇప్పించేందుకు రూ 10 వేలు లంచం డిమాండ్ చేశారు. బాధితుల నుండి రూ 5 వేలు బెల్లంపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద తీసుకుంటుండగా అడ్డంగా దొరికిపోయారు. ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే 1064 లేదా 9154388963 నెంబర్‌కి కాల్ చేసి తెలపాలని, బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ డిఎస్పి మధు చెప్పారు.

# ఆత్మ బలిదానాలు కాదు

- పోరాటాలతోనే సాధించాలి బీసీ రిజర్వేషన్లు
- ప్రభుత్వాల నిర్లక్ష్యమే ఈశ్వరచారి మరణానికి కారణం
- శ్రీకాంత్‌చారిలా, బీసీల కోసం ఈశ్వరచారి బలిదానం
- పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ చైర్‌పర్సన్ దాసరి ఉష



**జనోదయ,పెద్దపల్లి ప్రతినిధి డిసెంబర్ 5:**

బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఆత్మహత్యలు కాదు.. రాజ్యాంగం ఇచ్చిన హక్కులతో శాంతియుత పోరాటం కొనసాగించాలని పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ చైర్‌పర్సన్ దాసరి ఉష పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించి, కొవ్వత్తులతో సాయి ఈశ్వరచారికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఉష మాట్లాడుతూ, "బీసీ జనాభా ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వకుండా అన్ని రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయి. బీసీల ఎదుగుదలను అణగదొక్కుతున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ సామాజిక వర్గాన్నైనా ముందుకు తీసుకెళ్లేది ఆత్మబలిదానాలు కాదని, నిరంతర పోరాటాలే మార్పు తీసుకువస్తాయని స్పష్టం చేశారు. శ్రీకాంత్‌చారి బలిదానంతో తెలంగాణ ఉద్యమం వేగం పొందినట్లే, సాయి ఈశ్వరచారీ మరణం బీసీ రిజర్వేషన్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలకు నాంది కావాలని ఉష ఆకాంక్షించారు. "ప్రభుత్వాలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోవడమే కాక, ఇప్పటికే ఉన్న కోటాను కూడా 17 శాతానికి తగ్గించాయి. ఇదే ఈశ్వరచారీ ప్రాణం తీసుకున్న నిజమైన కారణం. ఇది ప్రమాద వశాత్తు మరణం కాదు..ప్రభుత్వం మీదే మోపాల్సిన హత్య" అని ఆమె తీవ్రంగా విమర్శించారు. తొందరపాటు నిర్ణయాలు తీసుకుని ప్రాణాలు తీసుకోవడం సమస్యల పరిష్కారం కాదని, చైతన్యంతో, చట్టబ ద్ధంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగించాలి అని ఉష పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ వైస్ చైర్మన్ కొండి సతీష్, జిల్లా కన్వీనర్లు, సహ కన్వీ నర్లు సలేంద్ర కొమరయ్య, బొల్లం భూమేష్, మిట్టపెల్లి శ్రీనివాస్, సిరవేన స్వప్న, అరుణ, బత్తుల రమేష్, కలవేన రవి, అభిలాస్ తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన నేలను అందించాలి

**వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి**



**జనోదయ , మందమర్రి డిసెంబర్ 5 :**

సమస్త జీవకోటికి జీవనాధారమైన నేలను భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరంగా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మండల వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి అన్నారు. ప్రపంచ నేల ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించు కొని శుక్రవారం మండలంలోని ఆదిల్ పేట గ్రామపం చాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో నేల ఆరోగ్య సంరక్షణ విధానా లపై రైతులకు అవగాహన కల్పించారు. రైతు సోదరులు ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం, సహజ సిద్ధ వ్యవసాయ విధానాలను పాటించి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయ విధానా లలో భాగంగా పశువుల పేడ, పచ్చిరొట్ట, వర్మీ కంపోస్ట్ వంటి వాటిని నేలకు అందించడం, భౌతిక, జీవ కీటక నియంత్రణ విధానాలు అవలంబించి అధిక రసాయనాలను నేలకు కలపకుండా జాగ్రత్త పడాలన్నారు. అవసరమున్న మేరకు దుక్కి చేయాలని ఎక్కువ లోతుగా దుక్కి చేయరాదని తద్వారా భూమికి అందించిన రసాయన ఎరువుల అవశేషాలు భూమి పొరల్లో నిలువ ఉండి చౌడు భూములుగా తయారవు తాయని దీనిని దృష్టిలో పెట్టుకొని రైతులు సరైన సేద్యపు విధానాలను పాటించాలని కోరారు.

# దుబ్బ రాజన్న టెంపుల్ ఎదుట ఘోర రోడ్డుప్రమాదం

**జనోదయ, జగిత్యాల ప్రతినిధి, డిసెంబర్ 05**

జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని ప్రసిద్ధ దుబ్బ రాజన్న దేవస్థానం ముందు ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్కూటీపై వస్తున్న ఇద్దరు యువతులను ఎదురుగా వేగంగా వస్తున్న డిస్కవర్ బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడిన యువతి కొలువై గ్రామానికి చెందినవారిగా గుర్తించగా, డిస్కవర్ బైక్ పై ఉన్న యువకుడు పెంబట్ల గ్రామానికి చెందినవాడిగా పోలీసులు గుర్తించారు. స్కూటీ పై ఉన్న యువతికి తలపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. ఇద్దరినీ జగిత్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువతికి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆయనను కరీంనగర్‌కు రిఫర్ చేశారు. వాహనాలు పరస్పరం ఢీకొన్న వేగం చాలా అధికంగా ఉండటంతో రెండు బైక్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు, రహదారిపై ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడమే ప్రమాదానికి కారణమని అంటున్నారు. దేవస్థానం వద్ద రోజూ పెద్ద సంఖ్యలో భక్తులు రావడం, కానీ రోడ్డు భద్రత సరైన విధంగా లేకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం ఇద్దరి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రజలు వేగంగా వాహనాలు



నడపకుండా జాగ్రత్తగా ఉండాలని పోలీస్ శాఖ సూచించింది.

## గుండెపోటుతో సర్పంచ్ అభ్యర్థి మృతి





**వేములవాడ , డిసెంబర్ 5:**
ప్రచారాన్ని ప్రారం భించిన సర్పంచ్ అభ్యర్థి ఆకస్మికంగా మృతి చెందడం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం చింతల్‌ఠాణా ఆర్అండ్ఆర్ గ్రామంలో విషాదం నింపింది. చింతల్‌ఠాణా (ఎస్సీ రిజర్వ్)లో మొదటి విడుత పంచాయతీ ఎన్నికల్లో చర్ల మురళి (53) బీఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. గురువారం రాత్రి 10 గంటల వరకు ప్రచారం చేసి ఇంటికి వచ్చిన కాసేపటికే గుండెపోటు రావడంతో అస్వస్థత చెందాడు. అభ్యర్థి మృతితో గ్రామంలో ఎన్నికలపై సందిగ్ధం నెలకొన్నది.

## చలికి గజగజ

**రాష్ట్రంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు**

**హైదరాబాద్, డిసెంబర్ 5 :** రాష్ట్రంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశమున్నదని తెలిపింది. ఇప్పటికే రాత్రిపూట చలికి జనం గజ గజ వణుకుతున్నారు. మరోవైపు అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో శుక్రవారం అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిశాయి. జోగులాంబ -గద్వాల, వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లో ఈ వర్షాలు కురిసినట్టు అధికారులు వెల్లడించా రు. మరో వారంపాటు పొడివాతావరణం ఉంటుదని తెలిపారు. కుమ్రం భీం జిల్లా సిర్పూర్‌లో అత్యల్పంగా 10.4 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వెల్లడించారు.




## రచనలకు ఆహ్వానం

నిత్య నూతనంగా వెలువడుతూ ఆశేష పాఠకాదరణ పొందుతున్న 'జనోదయ' తెలుగు దినపత్రికకు సమకాలీన రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్య,వైద్యం, స్పోర్ట్స్, వ్యవసాయం, శాస్త్రసాంకేతికం, సాహిత్యం, కథలు, నవలలు, వినోదం ..ఇలా అనేక అంశాల మీద వ్యాసాలు, రచనలకు ఆహ్వానం. మీ రచనలను కంపోజ్ చేసి కింది వాట్సాప్ నంబర్‌కు పంపాలి.

ఎడిటర్
జనోదయ
తెలుగు దినపత్రిక
**8074124190**

**నోట్ :** అంశం ఏదైనా విభిన్న శైలిలో, పాఠకులకు హత్తుకునేలా, విజ్ఞానాన్ని పంచేలా ఉండాలి. కంపోజ్ చేసిన వ్యాసాలకు మాత్రమే ప్రాధాన్యత ఉంటుంది. వ్యాసాల ప్రచురణ విషయంలో సంపాదకుడిదే తుది నిర్ణయం.ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు.

# ఆదర్శ విద్యా దీప్తి

## అసాధారణ ప్రతిభావంతుడు డా.ఎన్.వి.ఎన్.చారి



డాక్టర్.ఎన్.వి.ఎన్ చారి, జ్ఞానానికి , సేవకు తన జీవితాన్నంతా అంకితం చేసిన ఆదర్శ విద్యావేత్త. అర్థం కోసం కాదు, అర్థవంతమైన జీవితం కోసం తనను తాను విద్యారంగానికి అంకితం చేసుకొన్న అరుదైన విద్యా దీప్తి డా.ఎన్.వి.ఎన్.చారి.ఆయన జీవన యానం ఉత్తమ ఉపాధ్యాయునిగా, పరిశోధకునిగా, కవిగా, ఆధ్యాత్మిక సేవలోనూ, సామాజిక నిబద్ధతతో సాహిత్యం,కళలు, ఇలా విభిన్న రంగాలలో దేదీప్యమానంగా వెలిగిపోతూ అద్భుతమైన సేవలు చిరునవ్వుతో అందించిన ప్రేమ మూర్తి.ఆయన వ్యక్తిగతంగా ఎన్నో ఘనతలు సాధించినా స్నేహ శీలి, నిగర్వి డాక్టర్.ఎన్.వి.ఎన్.చారి. ఇటు అధ్యాపక వర్గానికి,అటు విద్యార్థి లోకానికి, మొత్తం సమాజానికి ఆయన స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు.

**జననం- బాల్యం**

నేటి హనుమకొండ జిల్లాలో కమలాపూర్ మండలంలో 'మర్రిపల్లి గూడెం' లోని శ్రీవైష్ణవ కుటుంబానికి చెందిన ప్రముఖ జ్యోతిష్య పండితులు, ప్రవచకులు నల్లన్ చక్రవర్తుల చక్రాచార్యులు వేదమ్మ దంపతులకు 01-01-1959న జన్మించారు. మొత్తం ఎనిమిది మంది సంతానంలో ముగ్గురు అక్కలు, ఇద్దరు అన్నలు ఇద్దరు తమ్ములు కలిగిఉన్నారు. బాల్యం నుండే క్రమ శిక్షణ, పఠనాభిలాష,వేదికపై వినూత్న వ్యక్తీకరణ ఆయన వ్యక్తిత్వానికి పునాది. వ్యాకరణ సుత్రాలు, కావ్యాలు, కథలు ,నవలలు చదవడం అనే అభ్యాసం వీరి అమ్మగారి నుండి లభించింది.

**విద్యా ప్రస్థానం**

స్వగ్రామంలో ప్రాథమిక విద్య, 8 నుండి 10 వరకు లష్కర్ బజార్ ప్రభుత్వ అభ్యసనోన్నత పాఠశాలలో చదువుకున్నారు. వ్యాసరచన, వక్తృత్వం, ఏకపాత్రాభినయ ప్రదర్శన లలో అనేక బహుమతులు హైస్కూల్ విద్యా ప్రాయంలోనే పొందారు. ఇంటర్ ఎం.ఇ.సీ.గ్రూపుతో హన్మకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, డిగ్రీ (బీ.కాం.) కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (1977-1080) బికాం పూర్తిచేశారు. కాకతీయ యునివర్సిటిలో ఎం.కాం., పీ.హెచ్.డీ., అమ రావతి యునివర్సిటీలో ఎం.ఫిల్ , ప్రొడెక్టివ్ కౌన్సిల్ ద్వారా పీజీడీసీఏ పూర్తి చేశారు. "గ్రామీణాభివృద్ధిలో జిల్లా పారిశ్రామిక సంస్థల పాత్రపై" పరిశోధన పత్రం సమర్పించి ఎం.ఫిల్, డిగ్రీ పొందారు. అలాగే "ఆంత్రప్రెన్యూర్షిప్ డెవలప్మెంట్" పై డాక్టరేట్ (2005) సాధించారు.అంతే కాకుండా యునివర్సిటీ గ్రాంట్స్ ఆర్థిక సహకారంతో "గ్రామీణ బాంకులలో నిరర్థక ఆస్తులపై" సూక్ష్మ యోజన పథకం పై మైనర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ (ఎం.ఆర్.పి.) పరిశోధనా పత్రాన్ని సమర్పించారు.ఎం.బీ.ఏ.( ఇగ్నో) అండ్ ఎం.ఫిల్ ( వినాయక మిషన్ యునివర్సిటీ) రీసెర్చ్ స్కాలర్స్‌కు మార్గదర్శిగా వ్యవహరించారు. అకౌంటింగ్-కంప్యూటర్ అప్లికేషన్స్ మేనేజ్మెంట్ రంగాలలో అనేక నవీన గ్రంథాల రచన ద్వారా విద్యార్థుల్లో అవగాహన పెంచిన విద్యా శిల్పి. గ్రూప్-I విద్యార్థులకోసం సైన్స్ అండ్ టెక్నాలజీ ఆంగ్ల పుస్తక రచన చేశారు.

**ఉద్యోగ ప్రస్థానం: అకడమిక్ సేవా యజ్ఞం**

జూనియర్ లెక్చరర్‌గా, అసోసియేట్ ప్రొఫెసర్- కామర్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ హెడ్ గా హన్మకొండ కాకతీయ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా ప్రభుత్వ డిగ్రీ కళాశాల,పర్కాల్ లో ప్రిన్సిపాల్ గా పనిచేసి 2017 మే నెలలో పదవీ విరమణ చేశారు. ఆ తర్వాత ప్రిన్సిపాల్ అరుణోదయ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, భీమారంలో స్పెషల్ ఆఫీసర్ గా, ఎం.జే.పీ. టీ.బీ.సీ.డబ్ల్యూ.ఆర్.డీ.సీ. సంస్థ లో 2023 వరకు పనిచేశారు.సిలబస్ రివిజన్ కమిటీ సభ్యునిగా ఉద్యోగ విద్యను పరిశ్రమ ధోరణులకు దగ్గర చేయడంలో ప్రాధాన్యం ఇచ్చారు. శాస్త్రీయ పరిశోధనా సేవలు "గ్రామీణ అబివృద్ధి, మైక్రోఫైనాన్స్" , "మెడికల్ టూరిజం, బ్రాండ్ స్టడీస్'కు అందించారు.సెమినార్లు-సిపోజియం, వర్క్ షాప్ లు, సిలబస్ రివ్యూ కమిటీ లు, అకడమిక్ గైడెన్స్ సెల్ యాక్టివిటీస్ లో చురుకుగా పాల్గొన్నారు. జాతీయ-అంతర్జాతీయ సెమినార్లలో విశిష్ట పరిశోధనా పత్ర సమర్పణలు చేశారు. ఉదాహరణకు: "ప్రపంచ ఆర్థిక సంక్షోభం - భారత ఆర్థిక వ్యవస్థ పై ప్రభావం"బీ " నాణ్యమైన విద్యకు ఉపాధ్యాయుల పాత్ర", "ఉన్నత విద్యలో నాణ్యత భరోసా సాధనా పద్ధతులు-సమస్యలు, సవాళ్ళు " మొదలైన 50కి పైగా పరిశోధనా పత్రాలు సమర్పించారు.

**తెలుగు అకడమి కోసం :ఇంటర్,డీగ్రీ పుస్తకాలు:**

" ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం క్వశ్చన్ బ్యాంక్ ", " ఫైనాన్షియల్ అకౌంటింగ్ విత్ ట్రాలీ"బీ బి.కాం విద్యార్థులకు "అడ్వాన్స్ ఎకౌంటింగ్ విత్ ట్రాలి ప్యాకేజీ తో, ఫండమెంటల్స్ ఇన్ టెక్నాలజీ, కార్పొరేట్ అకౌంటింగ్, ఇ- కామర్స్, ఇలా అనేక పాఠ్య పుస్తకాలు రాశారు.

**ఇతర అకడమిక్ సంబంధిత సేవలు:**

నాణ్యతా విద్యపై సెమినార్ల నిర్వాహణ, పుస్తకాల సంపాదన "న్యాక్" పరిశీలకుడు"గా అనేక కళాశాలలకు నాణ్యతా ప్రమాణాలకు మార్గదర్శనం చేశారు.

**రచనా-సాంస్కృతిక అభిరుచి**

విద్యావేత్తగా మాత్రమే కాకుండా కవి, నటుడు, దర్శకుడు, అనువాదకుడు, వాచకుడు- అన్ని రంగాల్లో తన విశిష్టతను చాటి చూపిన ప్రతిభ ఆయన సొంతం.

**స్వీయ -సాహిత్య రచనలు:**

నవస్వరాలు కవితా సంకళనం, విజయ గణపతి శతకం, అమృత బిందువులు, హనుమ శతకం, శ్రీవత్సాంకం స్మృతి కావ్యం. "సమస్యాపూరణం" - 2500 పద్యాలు (ముద్రణలో) " టీఏ ఎన్ఏ ప్రపంచ పద్యకావ్య పోటీలో ఎంపిక చేసి ఆన్ లైన్ లో ప్రచురించిన కావ్యం "తప్త భారతం తారకరామా శతకం" పూర్తి చేశారు.

**రేడియో,దూరదర్శన్ నుండి ఆడియో, వీడియో, పాఠాలు :**

ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్, మన టీవీ , ద్వారా ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు అనేక రేడియో పాఠాలు, కవితలు, కథనాలు అందించారు.సాహిత్యం,నాటకరంగం,

**సంస్కృతి వేదికల్లో చురుకైన పాత్ర:**

సాహృదయ సాహిత్య సంస్కృతిక వేదిక సాహిత్య సాంస్కృతిక ప్రధాన కార్యదర్శిగా, ప్రస్తుత ఉపాధ్యకునిగా భారతీయ సంస్కృతి, ఇతిహాస గాథలు, వేదోపనిషత్తుల జ్ఞానాన్ని సప్తాహ కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లిన శాస్త్ర-సాంస్కృతిక సారధి.

**నాటక రంగంలో - అద్వితీయ నటన:**

"వేదిక కళల్లో పట్టు" జాతీయ స్థాయిలో "మృగమైదానం", " గోగ్రహణం" , "వశీకరణం" వంటి నాటకాలలో నటించి కటక్ నేషనల్ డ్రామా ఫెస్టివల్లో "బెస్ట్ యాక్టర్" , "బెస్ట్ ప్రొడక్షన్" పురస్కారాలు పొందారు. "రంగస్థలం ఆయనకు కళ కాదు - సమాజానికి చూపే అద్దం."

**అవార్డులు-గౌరవ పురస్కారాలు:**

తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం - 2013, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2017, నవభారత్ రత్న, "ధర్మనిధి ఉత్తమ పద్యకవితా పురస్కారాలు, ఎన్.టీ.ఆర్. నేషనల్ అవార్డు 2023/24 జన్మభూమి కోఆర్డినేటర్ గా బంగారు పతకం పొందారు.జ్ఞానానికి, సేవకు, సృజనకు ఆయనే ప్రతీక.

**ఇతర సేవా కార్యక్రమాలు:**

సామాజిక-ఆధ్యాత్మిక సేవలు... సెంట్రల్ జైలు, వరంగల్ ఖైదీలకు, సిబ్బందికి "స్ట్రెస్ మేనేజ్ మెంట్‌లో శిక్షణ, గ్రామీణ విద్యాభివృద్ధి కార్యక్రమాలు, "శ్రీలేఖ, పోతన విజ్ఞాన పీఠం" , వివిధ సాహిత్య, సాంస్కృతిక సేవాసంస్థలలో ప్రముఖ పాత్ర

**శ్రీవత్సంక స్మారక చారిటబుల్ ట్రస్ట్:**

ఈ సేవా ట్రస్ట్‌కు అధ్యక్షుడుగా తన కుమారుని స్మృతిని సేవా రూపంగా మార్చిన మహత్తర దృక్పథం."ఉపాధ్యాయుడు ఒక వృత్తి కాదు ఒక వ్రతం అనే నమ్మకంతో జీవితమే విద్యార్థులకు అంకితం చేసిన జీవనదీపం డా. ఎన్.వి.ఎన్. చారి. సాహిత్య రసస్వాదమే కాదు విద్యారంగానికి ఆయన "ఆదర్శం .ఆదరణ కూడా - విభిన్న సేవా కార్యక్రమంలో ఆయన కార్య దీక్షా ధక్షతలను ప్రదర్శించారు. అయిన వివిధ రంగాల్లో బహుముఖంగా అందించిన సేవలు చిరస్మరణీయం.చివరిగా...డా.ఎన్.వీ.ఎన్. చారి... మా అధ్యాపక వర్గానికి అత్యంత సన్నిహిత మిత్రుడు అని చెప్పుకోవటం మా అందరికీ గర్వకారణం.ఈ అసమాన ప్రతిభా మూర్తి, స్నేహానికి, శాంతికి, సహనా నికి, సమర్థ వ్యవహార దక్షతకు పెట్టింది పేరు. అలసట, చిరాకు ,కోపం అనేవి ఆయనలో గత 30 సంవత్సరాల స్నేహంలో నేను చూసి ఉండలేదు. ఆయనకు సర్వదా వందనం. కృతజ్ఞతలు.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్ 9849328496

## న్యాయవాదులపై అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు

**రాఘవాపూర్ కోర్టు తీర్మానానికి వ్యతిరేకం**

**అధ్యక్షుడిపై అవిశ్వాసం పెట్టలేదన్న బార్ అసోసియేషన్**

**కుల రాజకీయాలకు శాశ్వత బహిష్కారం**

**జనోదయ,పెద్దపల్లి ప్రతినిది డిసెంబర్ 5:**
జిల్లా కేంద్రంలో కోర్టు నిర్మాణం అంశం న్యాయవాదుల మధ్య తీవ్ర స్థాయిలో విభేదాలకు దారితీసింది. ఆరోపణలు, ప్రత్యారోపణలు ఒకదానిపై మరొకటి పడుతుండగా, కేసు కోర్టు నిర్మాణం కన్నా వ్యక్తిగత ప్రయోజనాలు, అంతర్గత రాజకీయాల చుట్టూ తిరుగుతోందనే వాదన బలపడుతోంది.శుక్రవారం న్యాయవాదుల సమావేశంలో బార్ అసోసియేషన్ కొత్త కమిటీ నాయకత్వంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోటగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ, మాజీ అధ్యక్షుడిపై అవిశ్వాస తీర్మానం పెట్టలేదని, అధ్యక్ష పదవిలో నుండి శాశ్వతంగా తొలగించలేదని, నిబంధనలు ఉల్లంఘించిన కారణంగా ఒక సంవత్సరం సస్పెన్షన్ విధించామని వివరించారు. సభ్యుల అనుమతి లేకుండా, వ్యక్తిగత ప్రయోజనాల కోసం తీర్మానాలు చేయడం వల్లే ఈ చర్య తీసుకున్నామని తెలిపారు.కోర్టును రాఘవాపూర్ ప్రాంతంలో నిర్మించాలనే ప్రతిపాదనకు బార్ అసోసియేషన్ సంబంధం లేదని శ్రీనివాస్ స్పష్టం చేశారు. సభులెవరూ ఆ తీర్మానంపై సంతకాలు చేయలేదని, అయినా కూడా అసోసియేషన్‌తో సంబంధం లేని వ్యక్తుల సంతకాలు సేకరించి అదికారులకు తీర్మాణం సమర్పించారని ఆరోపించారు.అదే సందర్భంలో మాజీ అధ్యక్షుడు కుల కార్డును వాడుతూ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. న్యాయవాదులపై అవాస్తవాలు ప్రచారం చేస్తే శాశ్వత బహిష్కరణ తప్పదని హెచ్చరించారు.జిల్లా ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు జిల్లా కేంద్రంలోనే కోర్టు నిర్మాణానికి తమకు అభ్యంతరం లేదని న్యాయవాదులు స్పష్టం చేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం కోర్టును రాఘవాపూర్‌కు తరలించే ప్రయ త్నాలు చేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని అన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ సభ్యులు రెడ్డి శంకర్, బొంకూరి శంకర్, ఠాకూర్ క్రిష్ణ క్రాంతి సింగ్, మామిడిపల్లి శ్రత్ కుమార్, లవన్ కుమార్, రెడ్డి నర్సింగ్, తాని నరేష్, ఆసరి రమేష్ యాదవ్, ఉద్దెండ నవీన్, పాతర్ల శివ, బోండ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

